నమస్తే తెలంగాణ
సంగారెడ్డి
I హైదరాబాద్, శుక్రవారం 28 జూన్ 2024 SANGAREDDY



జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ దంపతులను సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ మంత్రి హరీశ్‌రావు

# సాగుకు ముందే రైతుభరోసా ఇవ్వాలి

- సిద్దిపేట జడ్పీ సర్వసభ్య సమావేశంలో తీర్మానం
- రైతు రాజును చేయాలన్నదే బీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యం..
- ఐదేండ్లుగా జిల్లా అభివృద్ధికి కృషి చేశాం..
- సహకరించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు
- జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ
- కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక జీపీలకు ఒక్క రూపాయి అయినా ఇచ్చారా..
- మధ్యాహ్న భోజన కార్మికులకు ఎందుకు జీతాలు ఇవ్వడం లేదు..
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు
- జిల్లా అభివృద్ధికి నావంతు కృషి చేస్తా..
- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట అర్బన్, జూన్ 27: పంట సాగుకు చేసే ముందే రైతుభరోసా కింద పంట పెట్టుబడి సాయం అందించాలని సిద్దిపేట జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించినట్లు జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజా రాధాకృష్ణశర్మ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో జడ్పీ చైర్‌పర్సన్ వేలేటి రోజాశర్మ అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ మేరకు పలు శాఖల అధికారులు తమ పురోగతిని సభ్యులకు వివరించారు. ముందుగా వ్యవసాయం, విద్యాశాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, అటవీశాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, విద్యుత్ శాఖ, పంచాయితీరాజ్, ఇంజినీరింగ్ శాఖల అధికారులు పురోగతిని వివరించారు. రైతుభరోసా కింద పెట్టుబడి సాయం రైతులకు పంట సాగుకు ముందే వేయాలని సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. గత సీజన్‌లో పంట చివరి వరకు కూడా రైతుభరోసా పూర్తిగా రాలేదని.. ఈ సీజన్‌కు కూడా పంట సాగు ప్రారంభమైనా ఇంకా రైతుభరోసా వేయడం లేదని సభ్యులు అధికారులను ప్రశ్నించారు. అంతే కాకుండా సఫాయి కార్మికుల జీతాలు సకాలంలో చెల్లించాలని జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది. జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ మాట్లాడుతూ.. రైతును రాజు చేయడమే లక్ష్యంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకాన్ని ప్రారంభించిందన్నారు. రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు పంట పెట్టుబడి సాయాన్ని పంట సాగుకంటే ముందే వేయాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన విద్యను అందించడమే లక్ష్యంగా సీఎం కేసీఆర్ 'మనఊరు మన బడి' పథకాన్ని ప్రారంభించి, అన్ని సదుపాయాలు కల్పించారన్నారు. సిద్దిపేట పట్టణంలోని కొన్ని పాఠశాలల్లో ప్రతి సంవత్సరం నో అడ్మిషన్ బోర్డులు కనిపిస్తున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన వ్యక్తి కేసీఆర్ అని..పాఠ్య పుస్తకాల మీద తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పేరును ఉంచితే బాగుండేదని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు.



జడ్పీటీసీలు, ఎంపీపీలతో మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీమంత్రి హరీశ్‌రావు, అధికారులు, ఇతర ప్రజాప్రతినిధులు

## జడ్పీ చైర్‌పర్సన్ కావడం పూర్వ జన్మ సుకృతం..



కేసీఆర్, మాజీమంత్రి హరీశ్‌రావు కృషితో నూతనంగా ఏర్పడిన సిద్దిపేట జిల్లాకు మొదటి జడ్పీ చైర్‌పర్సన్‌గా ఎన్నిక కావడం తన పూర్వ జన్మ సుకృతమని జడ్పీ చైర్ పర్సన్ రోజాశర్మ అన్నారు. ఈ స్థాయిలో ఉండేందుకు తన కుటుంబసభ్యులు ఎంతో సహకరించారని, కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత ఇంతటి అరుదైన అవకాశం కల్పించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని.. సిద్దిపేట జిల్లాను అభివృద్ధిలో ముందుండేందుకు ఎల్లవేళలా కలిసికట్టుగా పని చేశామన్నారు. ఇందుకు సహకరించిన ప్రజాప్రతినిధులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## రైతుభరోసా ఎప్పుడు వేస్తారు..



రైతులకు ఇవ్వాల్సిన పంట పెట్టుబడి సాయం సాగుకు ముందు వేస్తారా.. పంట కోతకు వచ్చిన తర్వాత వేస్తారా.. అని అధికారులను మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. జిల్లాలో జీలుగ, జనుము విత్తనాలు కొరత ఎందుకు ఏర్పడిందని అడిగారు. సిద్దిపేట జిల్లా పదోతరగతి ఫలితాల్లో రెండో స్థానంలో నిలిచినందుకు అధికారులను, ఉపాధ్యాయులను అభినందించారు. వరుసగా ఆరోసారి జిల్లా ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు ఏడు నెలల నుంచి జీతాలు ఎందుకు రావడం లేదని, వెంటనే జీతాలు వేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చివరిదశలో ఉన్న మనఊరు మనబడి పనులకు పూర్తి చేయాలన్నారు. ఈజీఎస్ కింద చేపట్టిన సీసీ రోడ్డు పనులకు సంబంధించిన బిల్లులు వెంటనే చెల్లించే విధంగా చొరవ చూపాలని కలెక్టర్‌ను కోరారు. ఇంట్లో ఇద్దరికి పెన్షన్ ఇస్తామని చెప్పి.. ఇప్పుడు వచ్చే పెన్షన్‌ను సకాలంలో ఇవ్వకపోవడంతోపాటు రెండు నెలల పెన్షన్ ఇవ్వలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు గ్రామ పంచాయితీలకు ఒక్క రుపాయి నిధులైన ఇచ్చారా అని అడిగారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వడం వల్ల గ్రామ పంచాయితీ ట్రాక్టర్ల ఇన్‌స్టాల్‌మెంట్ చెల్లించారని గుర్తు చేశారు. సఖి సెంటర్ ఉద్యోగులకు ఏడునెలల నుంచి జీతాలు రావట్లేదని అడిగారు. ఒకటో తారీఖునే జీతాలు అని గొప్పలు చెప్పే ప్రభుత్వం ఏం సమాధానం చెబుతారన్నారు. గృహజ్యోతి పథకాన్ని అర్హులైన అందరికీ వర్తింపజేయాలన్నారు. అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేట ప్రజలు బిల్లులు చెల్లించలేదని బదనాం చేశారని..రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలు బిల్లులు చెల్లించకపోతే ఎందుకు ప్రజలకు ఆపాదించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ లేని వ్యక్తి పనులను ప్రారంభిస్తే ఎంబీ రికార్డు ఎలా చేస్తారని అధికారులను ప్రశ్నించారు.

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

## ప్రొటోకాల్ తప్పకుండా పాటించాలి



ఏ సంబంధం లేని వ్యక్తులు కొబ్బరి కాయలు పట్టుకొని శంకుస్థాపనలు చేస్తున్నారని, ఇదెక్కడి సంస్కృతి అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్టీలకతీతంగా ప్రజాప్రతినిధులను గౌరవించాలని, ప్రొటోకాల్ విషయంలో అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించకూడదన్నారు. ప్రొటోకాల్ పాటించకుండా ప్రారంభించన పనులకు ఎంబీ రికార్డు చేయవద్దని ఎమ్మెల్యే అధికారులకు తెలిపారు. చేర్యాల, కొమురవెల్లి, ధూల్‌మిట్ట, మద్దూర్ మండలాల్లో పెండింగ్‌లో ఉన్న రోడ్లు, ఇతర పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

- ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

## అభివృద్ధికి నా వంతు కృషి చేస్తా..

పంట రుణమాఫీ చేసేందుకు క్యాబినెట్ నిర్ణయం తీసుకుందని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రజాప్రతినిధులుగా ఐదేండ్లు పూర్తి చేసుకున్న ఎంపీపీ, జడ్పీటీసీలకు శుభాకాంక్షలు తెలిపారు. భవిష్యత్‌లో మరింత ఉన్నతస్థాయిలో ఎదగాలన్నారు. పదవి ఉన్నా.. లేకున్నా., ప్రజా సమస్యలు పరిష్కరించడంలో ముందుండాలని సూచించారు. జిల్లా మంత్రిగా సిద్దిపేట అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానన్నారు. రాబోయే రోజుల్లో ఆరు గ్యారెంటీల అమలుతోపాటు ఇతర ప్రభుత్వ పథకాల అమలులో ఎటువంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకు రావాలన్నారు. రూ.1100కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాలల ద్వారా ఆయా గ్రామాల్లోని పాఠశాలల్లో పనులు జరుగుతన్నాయని తెలిపారు. అనంతరం జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ మాట్లాడుతూ.. ఐదేండ్లుగా జిల్లా అభివృద్ధి కోసం ఎంతో కృషి చేశామని, ఇందుకు సహకరించిన ప్రతి ఒక్క ప్రజాప్రతినిధికి ధన్యవాదాలు తెలిపారు.

- రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్

## సమయపాలన పాటించని అధికారులపై అసహనం

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని రెడ్డి సంక్షేమ భవన్‌లో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి అధికారులు రాకపోవడంపై మాజీమంత్రి హరీశ్‌రావు అసహనం వ్యక్తం చేశారు. సర్వసభ్య సమావేశం ఉదయం 10.30 గంటలకు ప్రారంభం కావడంతో 11 గంటల వరకు కూడా అధికారులు రాకపోవడంతో హరీశ్‌రావు ఎందుకు రాలేదని అడిగారు. పేరుపేరునా అధికారి సమావేశానికి వచ్చారా.. లేదా అని అడిగి తెలుసుకున్నారు. అధికారుల అలసత్వంపై కలెక్టర్ మనుచౌదరికి హరీశ్‌రావు ఫిర్యాదు చేశారు.

## హరితహారం చెట్లను ఎందుకు తొలిగిస్తున్నారు..



బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా హరితహారం మొక్కలు నాటి పెంచితే వాటిని విద్యుత్ శాఖ అధికారులు ఇష్టారీతిన నరికివేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మళ్లీ ఇలాంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దుబ్బాక నియోజకవర్గంలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందని, అధికారులు వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సిద్దిపేట జిల్లాకు ఇన్‌చార్జి మంత్రి ఉన్నారా.. లేరా.. ఉంటే సర్వసభ్య సమావేశానికి ఎందుకు రాలేదని ప్రభాకర్‌రెడ్డి ప్రశ్నించారు.

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి



సమావేశానికి హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారులు





## ప్రజాప్రతినిధులకు సన్మానం

సిద్దిపేట జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం చివరిది కావడంతో జిల్లాలోని జడ్పీటీసీలు, ఎంపీపీలను సన్మానించారు. ఈ మేరకు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీమంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి జడ్పీ చైర్‌పర్సన్ రోజా రాధాకృష్ణశర్మతోపాటు జడ్పీటీసీలు, ఎంపీపీలను శాలువా, మెమోంటోతో సత్కరించారు. అంతకుముందు జడ్పీటీసీలు, ఎంపీపీలు ఐదేండ్లలో తమకు కలిగిన అనుభవాలను గుర్తు చేసుకున్నారు. సమావేశంలో కలెక్టర్ మను చౌదరి, ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్, యాదవరెడ్డి, రఘోత్తంరెడ్డి, అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ పాల్గొన్నారు.

## ఫోన్లలో బిజీగా అధికారులు

సిద్దిపేట జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతున్నంత సేపు తమకేమీ పట్టనట్లుగా అధికారులు వ్యవహరించారు. సమావేశంలో జరిగే విషయాలు పట్టించుకోకుండా సెల్‌ఫోన్లలో బిజీగా గడిపారు. అందరికీ ఉపయోగపడే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఓ వైపు జిల్లా అధికారులు సర్వసభ్య సమావేశానికి సకాలంలో హాజరుకాకపోవడం, మరోవైపు సమావేశానికి వచ్చి ఎవరి ఫోన్లలో వారు గడుపుతూ సమయాన్ని వృథా చేయడం విమర్శలకు తావిస్తుంది.





ఫోన్‌లో బిజీగా ఉన్న అధికారులు

# సదాశివపేట అభివృద్ధికి కృషి

## మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సదాశివపేట : సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సదాశివపేట, జూన్ 27: సదాశివపేట పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ అపర్ణాశివరాజ్ పాటిల్ అధ్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చింతా ప్రభాకర్ మాట్లాడుతూ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సాధారణ సమావేశం ఆలస్యమైందన్నారు. గతంలో కేటాయించిన టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.20 కోట్లతో టెండర్ వేసి పనులు చేసుకోవచ్చని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారని గుర్తు చేశారు. ఎస్‌డీఎఫ్ నిధుల కింద కేటాయించిన పనులు చాలా జరగాల్సి ఉందన్నారు. రూ.25 కోట్ల ఎస్‌డీఎఫ్ నిధుల్లో రూ.11 కోట్లు మాత్రమే ఖర్చు అయ్యాయని, మిగతా నిధులు కూడా అభివృద్ధి పనులకు ఖర్చు చేయాలన్నారు. మిగతా పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. వర్షాకాలానికి సంబంధించిన తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పట్టణ సమగ్రాభివృద్ధి, కౌన్సిలర్లకు తన పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. అంతకుముందు ఎజెండా అంశాలను అధికారులు చదివి వినిపించారు. కౌన్సిలర్లు లేవనెత్తిన పలు సమస్యలను త్వరలోనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఉమ, మున్సిపల్ వైస్ చైర్మన్ చింతా గోపాల్, కౌన్సిలర్లు పిల్లోడి విశ్వనాథం, ప్రకాశ్, ఇంద్రమోహన్‌గౌడ్, ఇలియాజ్ షరీఫ్, ఖుద్దూస్, నాగరాజు గౌడ్, విద్యాసాగర్, గుండురవి, కో-ఆప్షన్ సభ్యుడు కోడూరి అంజయ్య, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు అందజేయాలి

## ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి



ఖమ్మంపల్లిలో బాధితులతో మాట్లాడుతున్న ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

కొండపాక(కుకునూరుపల్లి), జూన్ 27 : కొండపాక మండలంలోని ఖమ్మంపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను నిరుపేదలైన లబ్ధిదారులకు అందజేయాలని గజ్వేల్ నియోజవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి డిమాండ్ చేశాడు. కాంగ్రెస్ ప్రభుత్వం మూర్ఖత్వపు ఆలోచనలతో, అధికార బలంతో రెవెన్యూ, పోలీస్ సిబ్బందిని అడ్డుపెట్టుకొని 19 నిరుపేద కుటుంబాలను డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నుంచి గెంటివేసి ఇండ్లకు తాళాలు వేయడం హేయమైన చర్య అన్నారు. గురువారం ఖమ్మంపల్లిలోని డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను ప్రతాప్‌రెడ్డి సందర్శించడంతో పాటు బాధితుల కుటుంబాలను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఖమ్మంపల్లిలో నిరుపేదల కోసం 60 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణం చేశారన్నారు. 41 ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించగా, మరో 19 ఇండ్లను లబ్ధిదారులకు కేటాయించే క్రమంలో ఎన్నికల కోడ్ రావడంతో పంపిణీ చేయలేదన్నారు. గ్రామంలో ఎలాంటి ఆస్తిపాస్తులు లేని వారు ఆ ఇండ్లలో నివసిస్తున్నారని, దయనీయ పరిస్థితిలో ఉన్న వారందరికీ సిద్దిపేట కలెక్టర్, ఆర్డీవో మానవతా దృక్పథంతో ఆలోచించి ఇండ్లు కేటాయించాలన్నారు. లబ్ధిదారులకు అన్ని విధాలుగా బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని, వారికి పట్టాలు అందించే వరకు పోరాటం చేస్తామన్నారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్, రైతుబంధు మండల మాజీ కోఆర్డినేటర్ దుర్గయ్య, నాయకులు జిర్ర రాజు, అహ్మద్, సాయిలు, కోడెల మల్లేశం, కనకయ్య, దోమల శ్రీశైలం, అందె యాదగిరి ఉన్నారు.

# భూ తగాదాలతో రైతు హత్య

## నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు



హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలంటూ పోలీసులతో గ్రామస్తుల వాగ్వాదం



రామాయంపేట, జూన్ 27: భూ తగాదాలతో రైతును హత్య చేసిన ఘటన రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం గ్రామానికి చెందిన రైతు రాగుల అశోక్(50) ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. అప్పటికే పొలం వద్ద కాపుకాసిన పక్క పొలానికి చెందిన వ్యక్తులు అశోక్‌పై బండరాళ్లతో, కట్టెలతో దాడులకు దిగి హత్య చేశారు. మృతుడు అశోక్‌కు నిందితులు చేపూరి రమేశ్ కుటుంబానికి పదేండ్లుగా గెట్టు పంచాయితీ నడుస్తున్నది. భూమి విషయంలో గ్రామ పెద్దలు ఇరువురినీ సముదాయించినా సమస్య పరిష్కారం కాలేదు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. పోలీసులు విచారణ చేపట్టడంతో నిందితులు రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయారు. అశోక్‌ను హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని గ్రామస్తులు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఆవేశం పట్టలేని గ్రామస్తులు నిందితుడి ఇంటిపై దాడిచేసేందుకు వెళ్లారు. అక్కడికి పోలీసులు ఉండడంతో నిందితుల పశువుల కొట్టం, గడ్డివాములను దగ్ధం చేశారు. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టన్ నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పాతకక్షలు, భూతగాదాలతోనే అశోక్‌ను హత్య చేశారని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు.

# భూసార పరీక్షల ఊసేది..?

- నేలలో పోషకాలపై రైతులకు అవగాహన కరువు
- విచ్చలవిడిగా ఎరువుల వాడకంతో తగ్గుతున్న దిగుబడి
- మెదక్ జిల్లాలో నిలిచిపోయిన భూసార పరీక్షలు
- సాయిల్ టెస్ట్ కేంద్రంలో పనిచేయని పరికరాలు
- ఖాళీగా ల్యాబ్ అసిస్టెంట్, డేటా ఆపరేటర్ పోస్టులు
- శాంపిళ్లు వస్తే సంగారెడ్డికి వెళ్లాల్సిందే...
- పరీక్షలు చేసే వారు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులు
- భూసార పరీక్షలు నిర్వహించి సీజన్ల వారీగా వేసుకోవాల్సిన పంటలపై అవగాహన కల్పించాలంటున్న రైతులు

మెదక్, జూన్ 27 (నమస్తే తెలంగాణ): వ్యవసాయంలో మొక్కల ఎదుగుదలకు అవసరమైన పోషకాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకునేందుకు భూసార పరీక్షలు కీలకం. పరీక్షల ఫలితాల ఆధారంగానే నేలసారంపై అవగాహన వస్తోంది. దానికి అనుగుణంగా రైతులు పంటలు సాగు చేస్తూ.. తగిన మోతాదులో ఎరువులు వాడితే అధిక దిగుబడులు సాధించేందుకు ఆస్కారం ఉంటుంది. అయితే కొన్నేళ్లుగా మెదక్ జిల్లాలో భూసార పరీక్షలు నిలిచిపోయాయి. వేసవిలో పొలాల నుంచి సేకరించిన మట్టిని పరీక్షించి రైతులకు సలహాలు, సూచనలు అందించాల్సిన వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

### సంగారెడ్డికి వెళ్లాల్సిందే..

గతంలో ప్రభుత్వం సాయిల్ టెస్ట్ ల్యాబ్‌ల్లో సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులతో భూసార పరీక్షలు నిర్వహించే వారు. ఇందుకు అనుగుణంగా పరికరాలు, బడ్జెట్ కేటాయింపు ఉండేది. మెదక్ జిల్లా కేంద్రంలో సైతం సాయిల్ టెస్ట్‌కు ప్రత్యేక కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పుడు మంజూరు చేసిన కిట్ల గడువు ముగిసిపోవడంతో ప్రస్తుతం అవి పనిచేయడం లేదు. దీంతో మెదక్‌లోని సాయిల్ టెస్ట్ కేంద్రంలో ఒకటి, రెండు పరీక్షలు చేస్తున్నారు. పెద్ద మొత్తంలో వస్తున్న శాంపిళ్లను సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సాయిల్ టెస్ట్ ల్యాబ్‌కు పంపిస్తున్నారు. చాలా మంది దూరభారం, అవగాహన లేమితో భూసార పరీక్షలకు ముందుకు రావడం లేదు. మెదక్ జిల్లా కేంద్రంలోని సాయిల్ టెస్ట్ కేంద్రంలో ఉన్న వాటర్ ట్యాంకులు, పైపులు విరిగిపోవడంతో అవి పనిచేయడం లేదు. అంతేకాకుండా వ్యవసాయ శాఖ అధికారితోపాటు ల్యాబ్ అసిస్టెంట్, డేటా ఆపరేటర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో భూసార పరీక్షలు చేసే వారు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకవేళ రైతులు భూసార పరీక్షలు చేసుకోవాలనుకుంటే సంగారెడ్డి జిల్లాకు వెళ్తున్నారు.

### ఏడాదిగా బంద్

వ్యవసాయ శాఖ ప్రతిఏటా భూసార పరీక్షలు నిర్వహించి సీజన్ల వారీగా రైతులు వేసుకోవాల్సిన పంటలపై అవగాహన కల్పించాల్సి ఉంటుంది. ఏడాదిగా మెదక్ జిల్లాలో భూసార పరీక్షల ఊసే లేకపోవడంతో రైతులు ఇష్టారీతిన మందులు వాడుతూ నచ్చిన పంటలు సాగు చేసుకుంటున్నారు. అధికారులు కనీస అవగాహన కార్యక్రమాలు కూడా చేపట్టకపోవడంతో దిగుబడి తగ్గి తీవ్రంగా నష్టపోతున్నారు. పంట మార్పిడితో అవగాహన లేక చాలామంది కేవలం ఒక పంటకే పరిమితమవుతున్నారు. దీంతో నేల సారం కోల్పోయి నిర్జీవంగా మారుతోంది.



### వరి సాగుకు నేలలు అనుకూలం

మెదక్ జిల్లాలో మొత్తం 3.97 లక్షల ఎకరాల సాగు భూమి ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. దాదాపు 2.80 లక్షల మంది రైతులు వివిధ రకాల పంటలు సాగు చేస్తున్నారు. జిల్లాలో నేలలు ఎక్కువగా వరి పంట సాగుకు అనుకూలంగా ఉన్నాయి. ప్రతిఏటా అత్యధిక విస్తీర్ణంలో అంటే సుమారు 3 లక్షల ఎకరాల్లో వరి సాగవుతున్నది. ఆ తర్వాత 30 నుంచి 50వేల ఎకరాల్లో పత్తి, మొక్కజొన్న, కంది, ఇతర పంటలు సాగు చేస్తున్నారు. పూర్తిస్థాయిలో భూసార పరీక్షలు నిర్వహించే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

## వానకాలంలో 1,607 పరీక్షలు టార్గెట్..

వానకాలం సీజన్‌లో 1,607 భూసార పరీక్షలు చేయాలని టార్గెట్. ఆసక్తి ఉన్న రైతులు పంట చేను, పొలం నుంచి మట్టి నమూనాలను క్రమపద్ధతిలో సేకరించి మెదక్ జిల్లా కేంద్రంలోని సాయిల్ టెస్టింగ్ ల్యాబ్‌కు తీసుకురావాలి. ఎక్కువగా నమూనాలు రైతుల నుంచి వస్తే సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సాయిల్ టెస్ట్ ల్యాబ్‌కు పంపిస్తాం.

- గోవింద్, వ్యవసాయ శాఖ జిల్లా అధికారి, మెదక్